సాక్షి
సంగారెడ్డి
ఆదివారం । 21 । జనవరి । 2024



నిధుల్లేవ్.. నీళ్లు లేవ్!

వేలాది ఎకరాలకు సాగు నీరు అందించే కాళేశ్వరం కాల్వ పనులకు గ్రహణం వీడడం లేదు. వివరాలు 10లో ▸



ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. వివరాలు 10లో ▸



ట్రాఫిక్ తిప్పలు

రామచంద్రాపురంలో ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వివరాలు 11లో ▸

సాహితీ ఇన్‌ఫ్రాడ్‌టెక్!

పట్టా పేరుతో ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు

- ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోని అధికారులు
- ప్రీలాంచ్ ఆఫర్ పేరుతో రూ.వందల కోట్లు కొట్టేశారు
- లబోదిబోమంటున్న వినియోగదారులు
- కొత్త ప్రభుత్వంలో మరోమారు తెరపైకి భారీ రియల్ మోసం



అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూమిలో చేపడుతున్న నిర్మాణాలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ప్రీలాంచ్ ఆఫర్‌ల పేరుతో వందలాది మంది వినియోగదారులకు రూ. వందల కోట్లు కుచ్చుటోపీ పెట్టిన సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మోసాల్లో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పట్టణంలో.. 23 ఎకరాలు.. 32 అంతస్తులు.. పది టవర్లు.. అంతర్జాతీయ ప్రమాణాలు.. అంటూ అమాయకులను బురిడీ కొట్టించిన ఈ సంస్థ ఇప్పటి వరకు నిర్మాణ కార్యకలాపాలు సాగించింది ప్రభుత్వ భూమిలోననే ఫిర్యాదులున్నాయి. పట్టా భూమి పేరుతో దర్జాగా రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిలో కానీ ఈ అపార్టుమెంట్లు నిర్మించేందుకు పునాదుల తవ్వకాలను మాత్రం ప్రభుత్వ భూమిలో చేపట్టిందనే ఫిర్యాదులు వెల్లువెత్తాయి. నిర్మాణ కార్యకలాపాలను సాగించినా ఇన్నాళ్లు అధికారులు కళ్లు మూసుకోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు

అమీన్‌పూర్ పట్టణంలో సర్వే నెం.343లో పెద్ద మొత్తంలో ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో కొంత భూమిని స్వాతంత్య్ర సమరయోధులకు 2005లో గత ప్రభుత్వం కేటాయించింది. అప్పట్లో ఈ భూ కేటాయింపులు సక్రమంగా జరగలేదనే కారణంగా వాటిని తిరిగి స్వాధీనం చేసుకుంది. ఇదే సర్వే నెంబర్ భూమిలో తమకు పట్టా ఉందని.. ఇందులో ఈ టవర్లను నిర్మిస్తామని ఈ రియల్ ఎస్టేట్ సంస్థ ప్రీలాంచ్ ఆఫర్ పెట్టింది. ఈ సర్వే నంబర్‌లోని కొన్ని బై నంబర్లతో అగ్రిమెంట్ చేసుకుంది.

ఫిర్యాదులు వచ్చినా చర్యల్లేవ్..

ఈ రియల్ ఎస్టేట్ సంస్థ ప్రభుత్వ భూమిలో నిర్మాణ కార్యకలాపాలు చేపడుతోందని స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. స్థానిక రెవెన్యూ అధికారులతో పాటు, కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. రాజకీయ అండదండలు మెండుగా ఉండటంతో జిల్లా రెవెన్యూ అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూసింది. అంతేకాకుండా అధికారులకు పెద్ద మొత్తంలో ముడుపులు అందాయనే ఆరోపణలున్నాయి. జిల్లా కీలక అధికారి నుంచి మొదలు.. క్షేత్ర స్థాయిలోని రెవెన్యూ అధికారులకు స్థాయిని బట్టి కోట్ల రూపాయలు చేతులు మారినట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే అధికారులు కనీసం చర్యలకు ఉపక్రమించలేదనే విమర్శలు వచ్చాయి. ఇప్పుడు రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. అమీన్‌పూర్ పట్టణంలో గజం రూ.50 వేల వరకు పలుకుతుంది. అంటే ఎకరం రూ. వందల కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిలో దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పుడు రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఈ భూ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది.

నగరంలో మరికొన్ని ప్రాంతాల్లో..

ఈ రియల్ సంస్థ మోసాలు ఒక్క అమీన్‌పూర్‌కే పరిమితం కాలేదు. నగరంలో నానక్‌రామ్‌గూడ, కొంపల్లి, గచ్చిబౌలి, నిజాంపేట్, మోకిల, బాచుపల్లి వంటి ప్రాంతాల్లో కూడా ఈ సంస్థ పలు రియల్‌ఎస్టేట్ ప్రాజెక్టులను ప్రకటించింది. ప్రీలాంచ్ ఆఫర్ల అంటూ.. తక్కువ ధరకే అపార్టుమెంట్ అంటూ నగరంలో వందలాది మంది వినియోగదారులను బురిడీ కొట్టించింది. ఒక్కో వినియోగదారుడి వద్ద రూ. 40 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు వసూలు చేసింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వినియోగదారులు ఈ సంస్థ ఉచ్చులో చిక్కుకున్నారు. అపార్టుమెంట్ నిర్మించి రెండేళ్లలో అప్పగిస్తామని చెప్పిన ఈ సంస్థ పలుచోట్ల పూర్తిగా చేతులెత్తేసింది. రెండేళ్లు గడిచినా ఆయా ప్రాజెక్టుల్లో కనీసం పనులు జరగకపోవడంతో నగరంలోని పలువురు వినియోగదారులు సీసీఎస్ పోలీసులను ఆశ్రయించారు. మోసపోయిన వారంతా వందల సంఖ్యలో ఉండటంతో ఈ వినియోగదారులంతా ఏకంగా పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనలు నిర్వహించారు. దీనిపై కేసు నమోదు చేసిన నగర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కొందరు వినియోగదారులు కోర్టులను కూడా ఆశ్రయించారు. కోర్టు కూడా వినియోగదారుల వద్ద తీసుకున్న మొత్తానికి తొమ్మిది శాతం వడ్డీతో కలిపి డబ్బు చెల్లించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా చూపి వినియోగదారులకు రూ.వందల కోట్లు కుచ్చుటోపీ పెట్టిన వ్యవహారం వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- డీఎస్పీ పురుషోత్తం రెడ్డి



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ, ఎంవీఐ

పటాన్‌చెరు టౌన్: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలు నివారించాలని డీఎస్పీ పురుషోత్తంరెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 'రహదారి భద్రతా నియమాలు పాటించండి.. హీరో అవ్వండి' అని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అలాగే నియమాలకు సంబంధించిన స్టిక్కర్లు ఆటోలకు అతికించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ.. వాహనదారులు సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం ఎంవీఐ రాజా మహ్మద్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలు నివారించేందుకు సహకరించాలని తెలిపారు. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ.. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ రాంగ్ రూట్‌లో వాహనాలు నడపొద్దని తెలిపారు. కార్యక్రమంలో క్రైమ్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ప్రజా వేదిక



ప్రజావేదికలో మాట్లాడుతున్న అధికారులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): 2022–23లో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఇందులో జిల్లా అడిషనల్ పీడీ వామన్ రావు, జిల్లా విజిలెన్స్ అధికారి నాగేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 29 పంచాయతీలకు సంబంధించిన ఆడిట్ వివరాలను ప్రజలకు వివరించారు. తనిఖీలో పథకానికి సంబంధించిన రిజిస్టర్లు అప్ డేట్, నర్సరీల నిర్వహణ సరిగా లేకపోవడం, మాస్టర్లలో కొట్టివేతలు తదితర అంశాలు వెలుగుచూశాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పూజ, ప్లాంటేషన్ మేనేజర్ మణికుమారి, తనిఖీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష చూపితే చర్యలు

సంగారెడ్డి టౌన్: లింగ వివక్ష చూపితే కఠిన చర్యలు తప్పవని మహిళా సాధికారత సమన్వయకర్త పల్లవి అన్నారు. జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా మహిళా సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో 'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్, గ్రామసభల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, లింగ వివక్ష, సమానత్వం, చట్టాలు, హెల్ప్ లైన్ నంబర్ల గురించి అవగాహన కల్పించారు. అలాగే బాలికల విద్యా రక్షణ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గ్రామ సర్పంచుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఫసల్వాది సర్పంచి నిర్మలాదేవి, పంచాయతీ సెక్రటరీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

108 సేవల తనిఖీ



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నారాయణఖేడ్: ఖేడ్ నియోజకవర్గంలో 108 సేవలను శనివారం జిల్లా అధికారి హుస్సేన్, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లలో ఉన్న పరికరాలు, అందుబాటులో ఉన్న మందులు, రికార్డులను పరిశీలించారు. ఖేడ్ అంబులెన్స్ ఈఎంటీ గురప్ప, పైలట్ జగన్నాథంను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సేవలు ఎలా అందించాలో వారు సూచించారు.

ఇతర రాష్ట్రాల ఓటర్లను తొలగించండి



వినతి పత్రాన్ని అందిస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): ఇతర రాష్ట్రాలకు చెందిన వారి ఓట్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ మాదారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శనివారం డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రాజుగౌడ్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఇతర రాష్ట్రాల వ్యక్తులు ఇక్కడ, వారి సొంత గ్రామాల్లో ఓటు హక్కు కలిగి ఉన్నారని తెలిపారు. ఆధార్ కార్డులు లేని వారికి కూడా ఓట్లు ఉన్నాయని అధికారులకు వివరించారు.

టీపీజేఎంఏ నూతన కమిటీ

హత్నూర (సంగారెడ్డి): తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యం ఉమ్మడి మెదక్ జిల్లా సంఘం అధ్యక్షుడిగా హత్నూర గ్రామానికి చెందిన దుర్గేశ్వర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరసింహారెడ్డి, కోశాధికారిగా శర్మ, గౌరవ అధ్యక్షుడిగా నారాయణ, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్ చౌదరి, మధుసూదన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డిని ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి సూరికృష్ణ

జహీరాబాద్ టౌన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జహీరాబాద్ సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ పేర్కొన్నారు. మండల లీగల్ అవేర్‌నెస్ సర్వీసెస్ కమిటీ, ఆచార్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. విద్యార్థులకు వాహన, మహిళ, నిర్భయ, సమాచార హక్కు చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస్ రెడ్డి, గోపాల్, రుద్రయ్య స్వామి, బుజ్జమ్మ శ్రీనివాస్, చింతల హరికుమార్, శ్రీనివాస్‌రెడ్డి నందుగౌడ్, దత్తు, విజయలక్ష్మి, నర్సింలు, లావణ్య, నిఖిత, దీపిక, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

ఝరాసంగం(జహీరాబాద్): కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలని జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే తాటిపల్లి వెంకట రమణారెడ్డి సూచించారు. శనివారం బర్దిపూర్ గ్రామంలో నిర్వహించిన బీజేపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, అడివన్న, పాండు, వెంకటేశం పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో ఓడిపోతే బీఆర్ఎస్ కనుమరుగే

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని

జహీరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలైతే ఆ పార్టీ మనుగడ కష్టమే అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం జహీరాబాద్‌లో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో లేక మొన్నటి వరకు కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అలాగే ఉండిందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం టీడీపీ, పాతికేళ్ల క్రితం జనతాపార్టీ, జనతాదళ్, లోక్‌దళ్, చిరంజీవి పెట్టిన ప్రజారాజ్యం పార్టీ సైతం కనిపించకుండా పోయిందన్నారు. పవన్‌కళ్యాణ్ పార్టీ పరిస్థితి కూడా అందుకు భిన్నంగా ఏమీ లేదన్నారు. కమ్యూనిస్టు పార్టీ అలా కాదని.. ప్రజలు, సృష్టి ఉన్నంత వరకు ఉంటుందన్నారు. కమ్యూనిస్టు నేతలు సుధాకర్‌రెడ్డి, నారాయణలు పార్టీలు మారలేదని, ఒకవేళ అలా చేసి ఉంటే మంచి పదవులు పొందేవారన్నారు. ఆనాడు ఉన్న నీతి, విలువలు, పోరాటం, త్యాగాలు లేకుండా కేసీఆర్ కొత్త సంస్కృతి నేర్పారన్నారు. పోరాటాలకు పిలుపునిచ్చింది మగ్దూం మొహియొద్దీన్, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డిలు అని పేర్కొన్నారు. జహీరాబాద్‌లో సైతం ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో జరిగిన పోరాటంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రకాష్‌రావు, మంద పవన్, ఈటల నర్సింహా, జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు కావాలి

- కలెక్టర్ క్రాంతి



బీఎల్‌ఓలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్ : 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ క్రాంతి అన్నారు. జాబితాలో పేర్ల నమోదు, మార్పులు చేర్పుల కోసం పోలింగ్ బూత్ ల పరిధిలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలను శనివారం ఆమె సందర్శించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పోతిరెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరాల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓల వద్ద ఉన్న ఓటరు జాబితాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులకు ఆలస్యంగా వచ్చిన బీఎల్‌ఓ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించాలని, బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఆదివారం కూడా శిబిరాలు ఉంటాయని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ, తహసీల్దార్లు, తదితరులు ఉన్నారు.

స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ హాళ్ల పరిశీలన

పటాన్‌చెరు టౌన్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి అవసరమైన స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ హాళ్లను శనివారం రుద్రారం గీతం యూనివర్సిటీలో కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్ పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌ఓ నగేష్, డీఎస్పీ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 8న తుది జాబితా

ఫిబ్రవరి 8న ఓటర్ల తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ మాధురి అన్నారు. శనివారం అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడ గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన ఓటరు ప్రత్యేక శిబిరాన్ని ఆమె సందర్శించారు. మార్పుల కోసం దరఖాస్తు చేసుకునే ఫారం వివరాల గురించి బీఎల్‌ఓను ప్రశ్నించారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులు ఈనెల 22వ తేదీ వరకు ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈర్ల దేవానంద్, తదితరులు పాల్గొన్నారు.

100%

పదిలో ఉత్తీర్ణత లక్ష్యం



- ఉత్తమ ఫలితాలకు ప్రణాళిక
- ప్రభుత్వ బడుల్లో ప్రత్యేక తరగతులు
- వెనుకబడిన విద్యార్థులపై దృష్టి

న్యాల్‌కల్(జహీరాబాద్): పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా జిల్లా విద్యా శాఖ ముందుకు సాగుతోంది. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. గత ఏడాది టెన్త్‌లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలో జిల్లా మూడో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది కూడా మంచి ఫలితాలు సాధించి మొదటి స్థానంలో నిలిచేందుకు జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇందుకోసం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

జిల్లాలో 197 జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు ఒక కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు మొత్తం 458 ఉన్నాయి. అందులో 11,119 మంది బాలురు, 10,899 మంది బాలికలు, మొత్తం 22,018 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత ఏడాది 272 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. దీంతో జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచింది. ఈసారి శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

నవంబర్ నుంచి నిత్యం రెగ్యులర్ తరగతులతో పాటు ప్రతీ రోజు ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.45 నుంచి 5.45 గంటల వరకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వారిని గ్రూప్‌లుగా విభజిస్తున్నారు. గ్రూపుకు ఒక ఉపాధ్యాయుడు బాధ్యత తీసుకుని అర్థం కాని పాఠాలు బోధించడం, రెగ్యులర్‌గా తరగతులకు హాజరయ్యేలా చూడడం, పరీక్షలపై అవగాహన కల్పించడం చేస్తున్నారు. టెన్త్ పరీక్షలు మార్చి నెలలో ప్రారంభం కానుండడంతో ఉపాధ్యాయులు ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థుల ప్రతిభను నిత్యం పర్యవేక్షిస్తున్నారు. తరచూ విద్యార్థులకు స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు. తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చిస్తున్నారు. పిల్లలకు సందేహాలను నివృత్తి చేస్తూ మెరుగు పరచడానికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. చదివిన అంశాలపై గ్రూప్ డిస్కషన్ పెడుతున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం అందజేస్తున్న అల్పాహారం కొంత ప్రయోజనం చేకూరుతుంది.

ప్రత్యేక తరగతులు



ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు స్లిప్ టెస్టులు పెడుతున్నారు. తక్కువ మార్కులు వచ్చిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. బాగా చదివి పదిలో 10కి 10కి జీపీఏ సాధిస్తా.

– జశ్వంత్, విద్యార్థి, జెడ్పీహెచ్ఎస్ న్యాల్‌కల్

అర్థమయ్యేలా బోధిస్తున్నాం



పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఉపాధ్యాయులతో కలిసి శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా విద్యా బోధన చేస్తున్నాం. పిల్లలు ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలి.

– సచ్చిదానందరెడ్డి, హెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్, న్యాల్‌కల్

మొదటి స్థానంలో నిలుపుతాం



గత ఏడాది పదిలో మంచి ఫలితాలు సాధించాం. 272 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాను రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిపాం. ఈ ఏడాది కూడా మంచి ఫలితాలు సాధించి మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. పాఠశాలలను ఎప్పటికప్పుడు సందర్శించి ఉపాధ్యాయులకు సూచనలిస్తున్నాం.

– వెంకటేశ్వర్లు, డీఈఓ, సంగారెడ్డి

ఇసుక ఫిల్టర్లు నిర్వహిస్తే కేసులు



ఇసుక ఫిల్టర్లను పరిశీలిస్తున్న అధికారులు

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని బ్యాతోల్, ఎర్దనూర్ శివారులో కృత్రిమ ఇసుక తయారు చేస్తున్న ఫిల్టర్లను రెవెన్యూ, పోలీస్ అధికారులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నిర్వహిస్తున్న ఇసుక ఫిల్టర్లను ఇదివరకే కూల్చివేశామని తెలిపారు. తిరిగి ఎవరైనా వాటిని నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వీటి వల్ల భూగర్భజలాలు అడుగంటుతాయన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సుధీర్ కుమార్, ఆర్ఐ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమ్మెను విజయవంతం చేయండి

సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజయ్య


సమావేశంలో రాజయ్య, కార్యకర్తలు

జిన్నారం(పటాన్‌చెరు): కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ వచ్చే నెల 16న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజయ్య పిలుపునిచ్చారు. జిన్నారం మండలంలోని ఖాజీపల్లి పారిశ్రామిక వాడలో సీఐటీయూ క్లస్టర్ కార్యకర్తలతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్‌కు అండగా నిలుస్తుందన్నారు. మూడోసారి దేశంలో బీజేపీ అధికారంలోకి రావడం కోసం కేంద్రం అనేక జిమ్మిక్కులు చేస్తుందన్నారు. కేంద్రం అనుసరిస్తున్న వైఖరిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


భావనను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దుబ్బాకటౌన్ : జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో డిసెంబర్‌లో ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో దుబ్బాక మున్సిపాల్టిలోని ధర్మాజీపేట పాఠశాల విద్యార్థిని జి.భావన ప్రదర్శించిన ఎగ్జిబిట్ రాష్ట్రస్థాయికి ఎంపికైంది. సైన్స్ ఫెయిర్‌లో గణిత విభాగానికి చెందిన కంప్యూటర్ థింకింగ్‌లో త్రిగ్నోమెట్రిక్ పార్క్ మ్యాథమెటిక్స్ మోడల్ కంప్యూటేషనల్ థింకింగ్ సబ్ థీమ్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థి భావనతోపాటు గైడ్ టీచర్లుగా వ్యవహరించిన పద్మావతి, శ్రీనివాస్‌రెడ్డిలను శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

నిధుల్లేవ్.. నీళ్లూ లేవ్!

కాళేశ్వరం కాల్వల పనులకు గ్రహణం

- నత్తనడకన కొనసాగుతున్న పనులు
- ఆరేళ్లు అయినా పూర్తికాని భూసేకరణ
- ఇంకా సేకరించాల్సింది 1,429 ఎకరాలు
- నిధుల విడుదలే ప్రధాన సమస్య
- 93 వేల ఎకరాలకు అందని నీళ్లు

జిల్లాలో వేలాది ఎకరాలకు సాగు నీరు అందించే కాళేశ్వరం కాల్వల పనులకు గ్రహణం వీడడం లేదు. ప్రధాన మూడు ప్యాకేజీలకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ ఇప్పటి వరకు పూర్తి కాలేదు. దీని ఫలితంగా కాల్వల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. 2018లో ప్రారంభమైన పనులు ఆరేళ్లుగా అలాగే ఉన్నాయి. ఇందుకు నిధుల విడుదలే ప్రధాన సమస్యగా అధికారులు చెబుతున్నారు. ఈ విషయంపై అధికారులు తరచూ సమీక్షలు నిర్వహించడం తప్ప ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. గతేడాది సెప్టెంబర్ వరకే పనులు పూర్తి చేస్తామని లక్ష్యం పెట్టుకున్నా నెరవేరలేదు. - మెదక్


వెల్దుర్తి మండల శివారులో అసంపూర్తిగా ఉన్న కాల్వ

కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో 17,18,19 ప్యాకేజీలు ప్రధానమైనవి. ఈ మూడు ప్యాకేజీలు పూర్తి అయితే జిల్లాలోని 93 వేల ఎకరాల ఆయకట్టుకు సాగుకు నీరందుతుంది. మూడు ప్యాకేజీల ద్వారా వెల్దుర్తి, కొడిపల్లి, కొల్చారం, చిలప్‌చెడ్, టేక్మాల్, పాపన్నపేట, పెద్దశంకరంపేట, అల్లాదుర్గం మండలాల పరిధిలో సస్యశ్యామలం అవుతుంది. ఇందుకుగాను మొత్తం 4,791 ఎకరాల భూమి సేకరించాల్సిన అవసరం ఉంది. ఇప్పటి వరకు 3,362 ఎకరాల భూ సేకరణ జరిగింది. ఇంకా 1,429 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఇంకా భూసేకరణ 17వ ప్యాకేజీలో 22 ఎకరాలు, 18వ ప్యాకేజీలో 486 ఎకరాలు, 19వ, ప్యాకేజీలో 921 ఎకరాలు ఉంది. ఈ భూముల సేకరణకు రూ.330.38 కోట్లు నిధులు అవసరం అవుతాయని అధికారులు చెబుతున్నారు.

రూ.886.72 కోట్ల బకాయిలు..

కాళేశ్వరం పనులను 17, 18, 19 ప్యాకేజీలుగా విభజించారు. ఇందులో 17వ ప్యాకేజీ పనుల కోసం రూ. 986.18 కోట్లు, 18వ ప్యాకేజీకి రూ.758 కోట్లు, 19వ ప్యాకేజీకి రూ.762.42 కోట్లు వెచ్చిస్తున్నారు. ఈ మూడు ప్యాకేజీల నిర్మాణాలకు మొత్తం రూ.2,506.47 కోట్లు విడుదల కావాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.1,620 కోట్లు మాత్రమే విడుదలైనట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా రూ.886.72 కోట్లు విడుదల కావాల్సి ఉంది.

ప్యాకేజీల వారీగా భూమి వివరాలు..

కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్యాకేజీ 17లో 4.575 కిలోమీటర్ల దూరం మెయిన్ కెనాల్ , 18.62 కిలోమీటర్ల టన్నెల్ నిర్మించాలి. ప్యాకేజీ 18లో 36.305 కిలో మీటర్ల దూరం మెయిన్ కెనాల్ 3.948 కిలోమీటర్ల దూరం టన్నెల్ నిర్మించాలి. ప్యాకేజీ 19లో 12 కిలోమీటర్ల దూరం మెయిన్ కెనాల్, 75.2 కిలోమీటర్ల దూరం బ్రాంచ్ కెనాల్ నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

'నీరు'గారుతున్న లక్ష్యం

కాళేశ్వరం ప్రాజెక్ట్ కాల్వల పనులు 2018లో ప్రారంభమయ్యాయి. అప్పట్లో పాలకులు, అధికారులు మూడేళ్లలో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. కానీ ఆరేళ్లు అవుతున్నా ఇంతవరకు పూర్తి కాలేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది. ఇవి పూర్తయితే వేలాది ఎకరాలకు నీరందుతుందని రైతులు ఎదురుచూస్తున్నారు. ఏళ్ల తరబడి నిధులు ఏకకాలంలో విడుదల కాకపోవడంతో జాప్యం జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిధులు విడుదల చేసి త్వరగా కాల్వల నిర్మాణం పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష


వర్గల్(గజ్వేల్): గజ్వేల్‌లోని ఓ హైస్కూల్‌లో పరీక్షను పరిశీలిస్తున్న ఆర్డీఓ బన్సీలాల్

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3,703 మంది హాజరు

జిల్లా	దరఖాస్తులు	హాజరు	గైర్హాజరు
సంగారెడ్డి	2,113	1,359	754
మెదక్	1,501	933	568
సిద్దిపేట	2,182	1,411	771


మిరుదొడ్డి(దుబ్బాక): పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2024–25 విద్యా సంవత్సరం ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష నిర్వహణకు వివిధ ప్రాంతాల్లో 29 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 5,796 మంది విద్యార్థులకు గాను 3,703 మంది పరీక్షకు హాజరు కాగా 2,093 మంది గైర్హాజరైనట్లు వర్గల్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పరీక్ష ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రశాంతంగా కొనసాగిందన్నారు.


సదాశివపేట సెయింట్ మేరీస్ పీఎస్ఎమ్ హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు


రామాయంపేట : పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

ఆలయ భూములను కాపాడాలి

- భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి
- సీపీఎం ఆధ్వర్యంలో మల్లన్న ఆలయ ఈవోకు వినతిపత్రం


ఆలయ ఈవో బాలాజీకి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): కబ్జాకు గురవుతున్న కొమురవెల్లి మల్లికార్జున స్వామి భూములను కాపాడాలని, జాతర సందర్భంగా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ఆలయ ఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఆలయానికి కేటాయించిన భూములు కబ్జాకు గురవుతున్నా పట్టించుకోలేదని, ఇప్పటికైనా స్వామి వారి భూములకు హద్దులు ఏర్పాటు చేసి ప్రహరీ నిర్మించాలన్నారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు సరిపడా టాయిలెట్లు, మంచి నీటి సౌకర్యం, పార్కింగ్ ప్రదేశాలు లేవని అన్నారు. 12వ తేదీన నిర్వహించిన పాలక సమావేశానికి జనగామ డీసీసీ అధ్యక్షుడు ఏ హోదాలో హాజరయ్యాడని ఈవో బాలాజీని ప్రశ్నించారు. సమావేశానికి అనుమతి ఇచ్చిన ఈవోపై దేవాదాయ శాఖ కమిషనర్‌కు త్వరలోనే ఫిర్యాదు చేస్తామని వినతిపత్రం అందజేసిన అనంతరం విలేకరులతో తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగా కృష్ణారెడ్డి, రాంసాగర్ సర్పంచ్ తాడూరి రవీందర్, మండల నాయకులు తేలు ఇస్తారి, బాలకిషన్, సాయిలు, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

- చేర్యాలలో ఎనిమిది మంది, రాయికోడ్‌లో 12 మంది
- రూ.1.70 లక్షలు స్వాధీనం



చేర్యాల(సిద్దిపేట): ఎనిమిది మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసి నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ దామోదర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. ఇందులో 8 మందిని అదుపులోకి తీసుకోవడంతోపాటు వారి నుంచి రూ.1.70లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రాయికోడ్(అందోల్): మండలంలోని కుసునూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం సాయంత్రం గ్రామ సమీపంలోని వాగు ఒడ్డున ఓ చెట్టు కింద పేకాట ఆడుతుండగా సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. పేకాట ఆడుతున్న 12 మంది కుసునూర్ గ్రామస్తులను అరెస్ట్ చేశామన్నారు. వీరి వద్ద రూ.19,900 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

జోగిపేట జూనియర్ సివిల్ జడ్జి ధనలక్ష్మి


మాట్లాడుతున్న ధనలక్ష్మి

జోగిపేట (అందోల్): సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జోగిపేట జూనియర్ సివిల్ జడ్జి ధనలక్ష్మి సూచించారు. శనివారం జోగిపేట బీసీ గురుకుల పాఠశాల బాలుర హాస్టల్‌ను తనిఖీ చేశారు. కిచెన్ రూమ్, డైనింగ్ హాల్‌ను పరిశీలించి విద్యార్థులకు న్యాయమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని ఉన్న స్థాయికి ఎదగాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

- పొలం పనులు చేస్తుండగా ఎత్తుకెళ్లిన దొంగ
- నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలింపు
- వివరాలను వెల్లడించిన ఏసీపీ సురేందర్‌రెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ సురేందర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): మహిళ మెడలోంచి పుస్తెల తాడును ఎత్తుకెళ్లిన దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. కొండపాక మండలంలోని దుద్దెడ మధిర సెలంపు గ్రామానికి చెందిన పాతర్ల మల్లవ్వ ఈనెల 18న సొంత పొలం వద్ద పనులు చేస్తుండగా షాహిద్ అనే వ్యక్తి వచ్చాడు. పక్కన వెంచర్‌లో ప్లాట్లు విక్రయిస్తున్నామంటూ ఆమెతో మాటమాట కలిపాడు. దాహానికి నీళ్లు అడగడంతో మల్లవ్వ ఇస్తుండగా మెడలో 3 తులాల పైచిలుకు పుస్తెల తాడును గమనించాడు. సాయంత్రం వరకు మహిళ పని చేస్తున్న ప్రదేశంలోనే అటూ ఇటూ తిరుగుతూ కాలక్షేపం చేశాడు. 5 గంటల ప్రాంతంలో మల్లవ్వకు దూరంగా కుటుంబీకులు పని చేస్తున్న విషయాన్ని గమనించి ఆమెను కిందపడేసి పుస్తెలతాడు ఎత్తుకెళ్లాడు. బాధితురాలు మల్లవ్వ ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. శనివారం త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్సాన్‌పల్లి శివారులో సీఐ భాను ప్రకాశ్‌తో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా నిందితుడు షాహిద్ అనుమానాస్పదంగా బైక్‌పై తిరుగుతూ కనిపించాడు. అతడిని పట్టుకొని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. పుస్తెల తాడును ఓ షాపులో కుదవపెట్టగా స్వాధీనం చేసుకొని షాహిద్‌ను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడు తొగుట మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామవాసి అని పేర్కొన్నారు. కేసును తొందరగా ఛేదించిన సీఐ భాను ప్రకాశ్, ఐడీ పార్టీ కానిస్టేబుళ్లు ఎండీ అఫ్జల్, మంత్రి శ్రీనివాస్, ముత్తంగి స్వామి, సీసీ కెమెరా ఆపరేటర్లు పరంధాములు, జగన్‌ను ఏసీపీ సురేందర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

గురుకులాల భద్రత మన బాధ్యత

టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్


ఎన్నికైన నూతన కార్యవర్గం

సిద్దిపేటకమాన్: గురుకులాల భద్రత మన బాధ్యత అని, సామాజిక సమస్యలపై పోరాటం చేస్తామని తెలంగాణ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. గురుకులాల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, నూతన భవనాల నిర్మాణం కోసం పని చేస్తున్న సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకులాల పేరెంట్స్ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పవన్‌కుమార్, నందం, లావణ్య, సత్యం, అనీల్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరు ఆత్మహత్య


సాధు(ఫైల్)

ఆర్థిక ఇబ్బందులతో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు.

హవేళిఘణాపూర్(మెదక్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన హవేళిఘణాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కు మ్మరి సాధు (28) ప్రైవేటు బస్సు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మధ్య కాలంలో ఇంటి నిర్మాణం చేపట్టగా, అప్పులు ఎక్కువయ్యాయి. ఆర్థిక ఇబ్బందులు తాళలేక శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య ఎల్లమ్మ, కుమార్తె ఉంది. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో దూకి..


కనకయ్య(ఫైల్)

గజ్వేల్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గజ్వేల్ పట్టణంలోని (పార్శికుంట) వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని రాజిరెడ్డిపల్లికి చెందిన పుల్ల కనకయ్య(40)కు భార్య కవిత, కొడుకు, కూతురు ఉన్నారు. కనకయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా ఎటువంటి పని చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన కనకయ్య శనివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయి సమీపంలోని పార్శికుంట(చెరువు)లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ భూమి కబ్జా చేస్తే..

- ప్రభుత్వ పథకాలు కట్
- త్వరలోనే ఫారెస్ట్‌ను గుర్తించి కందకాలు తీస్తాం
- రేంజ్ ఆఫీసర్ మనోజ్‌కుమార్


అవగాహన కల్పిస్తున్న అధికారులు

హవేళిఘణాపూర్(మెదక్): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎవరైనా అడవిని కబ్జా చేసేందుకు యత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలకు నిలిపివేస్తామని అటవీ రేంజ్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని గాజిరెడ్డిపల్లి గ్రామంలో అటవీ సంరక్షణ, అడవిని కాపాడడం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా అటవీ ప్రాంతంలోని భూమి కబ్జా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, అటవీ అధికారులతో జాయింట్ సర్వే చేసి కందకాలు తవ్వనున్నట్లు పేర్కొన్నారు. అడవులను సంరక్షించే బాధ్యత అందరిపై ఉందని, అందుకోసం ప్రతి ఒక్కరూ కాపాడాలన్నారు. ఎవరైనా ఫారెస్ట్ నిబంధనలు అతిక్రమించి వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీరామ్, డిప్యూటీ తహసీల్దార్, ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్, ఫారెస్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ దుకాణంలో రూ.7 లక్షలు చోరీ

- క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు
- తూప్రాన్‌లోని పోతరాజుపల్లి వద్ద ఘటన


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం బృందం

తూప్రాన్: సిమెంట్ దుకాణంలో భారీ నగదు చోరీ జరిగిన ఘటన తూప్రాన్ పట్టణ కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది.ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన మామిండ్ల శ్రీకాంత్ పట్టణంలోని పోతరాజుపల్లి గ్రామ సమీపంలో రహదారి పక్కన నటరాజ్ ఎంటర్ ప్రైజెస్ షాపు పెట్టి సిమెంట్, స్టీల్, సెంట్రింగ్ బాక్స్‌లను విక్రయిస్తున్నాడు. కొన్ని రోజులుగా జరిగిన వ్యాపారం డబ్బులను శుక్రవారం రాత్రి షాపు కౌంటర్‌లోనే దాచిపెట్టి తాళం వేసి ఇంటికెళ్లాడు. శనివారం ఉదయం దుకాణం తెరిచి చూడగా కౌంటర్‌లోని రూ.7.10 లక్షలు కనిపించలేదు. షాపు పైకప్పు పగిలిపోయి ఉంది. శ్రీకాంత్ వెంటనే పోలీసులు ఫిర్యాదు చేయడంతో సీఐ శ్రీధర్, ఎస్‌ఐ శివానందం ఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును గమనించి క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. నిందితుల వేలిముద్రలు సేకరించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు.

కమీషన్లు, ఉద్యోగాల పేరుతో మోసం

రూ.3.85 లక్షలు పోగొట్టుకున్న బాధితులు



పటాన్‌చెరు టౌన్: సైబర్ వలలో పడి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి డబ్బులు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని సాయి అనురాగ్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ వాట్సాప్‌కు జనవరి 18వ తేదీన మెసేజ్ వచ్చింది. అందులోని లింక్ ఓపెన్ చేసి తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతడికి వ్యాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్క్‌లు చేశాడు. సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వ్యాలెట్‌లో నగదును, కమీషన్‌ను చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.2 లక్షలు 85 వేలు చెల్లించాడు. చివరిగా తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా నేరగాళ్లు స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి..

అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ జయలక్ష్మి నగర్‌కు చెందిన నిరుద్యోగి సాగర్‌కు అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్ గూడా కృషి డిఫెన్స్ కాలనీ చెందిన మట్టం విశ్వేశ్వర్ అలియాస్ విష్ణుతో పరిచయం ఏర్పడింది. ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో విష్ణుకు సాగర్ రూ.లక్ష చెల్లించాడు. ఉద్యోగం ఎప్పుడు ఇప్పిస్తావని అడుగడంతో సరిగా స్పందించలేదు. బాధితుడు అమీన్‌పూర్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మోసపోతున్న వారిలో మైనర్లే ఎక్కువ

జోగిపేట (అందోల్): ప్రేమ పేరుతో మోసపోతున్న వారిలో మైనర్లే ఎక్కువగా ఉన్నారని, ఆ కేసులే ఎక్కువ వస్తున్నాయని సంగారెడ్డి డీఎస్పీ రమేశ్ కుమార్ తెలిపారు. శనివారం జోగిపేటలోని పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. జోగిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసుల్లో పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే కేసులే ఎక్కువగా ఉన్నాయన్నారు. తల్లిదండ్రులకు, పిల్లలకు సరైన అవగాహన లేకపోవడంతోనే పోక్సో చట్టం కేసుల బారిన పడుతున్నారన్నారు. పోలీస్‌శాఖ తరఫున ప్రతీ పాఠశాల, కళాశాలలో సదస్సులను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామన్నారు.